Follow: @ANNTELUGU
REGISTERED NUMBER
APTEL/2014/58382
23-04-2026

ANN తెలుగు

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 116 పేజీలు-04 వెల-రూ.1
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD గురువారం WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్



## కుట్రలు కూలాయి.. కాళేశ్వరం గెలిచింది

- హైకోర్టు తీర్పుపై కేటీఆర్

02

## మమతా బెనర్జీ చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పు



- తనిఖీల మధ్యలోకి సీఎం వెళ్లడంపై తీవ్ర ఆగ్రహం
- కేంద్రం వర్సెస్ రాష్ట్రం వివాదంగా మార్చొద్దు
- సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు

02

## ప్రధాని మోదీపై 'ఉగ్రవాది' వ్యాఖ్యల దుమారం



- ఏఐసీసీ చీఫ్ ఖర్గేకు ఈసీ నోటీసులు
- 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం
- నిబంధనల ఉల్లంఘనపై ఈసీ సీరియస్
- బీజేపీ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఎన్నికల సంఘం

02



## ఏప్రిల్ 30న మంత్రివర్గ విస్తరణ ప్రచారం

### యాదవ, మున్నూరు కాపులకు స్థానం

నవీన్ యాదవ్ లేదా బీర్ల ఐలయ్యలలో ఒకరికి ఛాన్స్

మున్నూరు కాపు కోటాలో ఆదిశ్రీనివాస్ కు అవకాశం

**హైదరాబాద్, మహా:** ఏప్రిల్ 30న తెలంగాణ మంత్రివర్గ విస్తరణ జరుగుతుందనే ప్రచారం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా సామాజిక సమీకరణాల్లో భాగంగా యాదవ మరియు మున్నూరు కాపు సామాజిక వర్గాలకు ప్రాధాన్యత లభించనుందని తెలుస్తోంది. బీసీలలో ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన జాబితా ప్రకారం ముదిరాజ్, యాదవ, మున్నూరుకాపు సామాజిక వర్గాలు బీసీలలో అధికంగా ఉన్నారు. అత్యధికంగా ఉన్న ముదిరాజ్ సామాజికవర్గానికి ఇప్పటికే క్యాబినెట్ లో చోటు కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి త్వరలో యాదవ, మున్నూరుకాపులను కూడా తమ కేబినెట్ లో బెర్త్ లు కేటాయించే అవకాశమంది. ఇటీవల దీనిపై ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వద్ద చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

**విస్తరణకు సంబంధించి ప్రధానంగా వినిపిస్తున్న పేర్లు ఇవే:**

యాదవ సామాజిక వర్గం (నవీన్ యాదవ్ లేదా బీర్ల ఐలయ్య) మిగతా 2లో



## కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సిద్ధమా?

### బీఆర్ఎస్‌కు మంత్రి పొంగులేటి సవాల్

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఎలాంటి అవినీతి జరగలేదని పదే పదే చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు నిజంగా నిర్దోషులైతే, వెంటనే స్వయంగా సీబీఐ విచారణకు డిమాండ్ చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు.

మిగతా 2లో




## జబర్దస్త్ కు నాగబాబు రీ ఎంట్రీ

**మహా:** ఒకప్పుడు తెలుగు టెలివిజన్‌లో టాప్ రేటింగ్స్‌తో దూసుకెళ్లిన ప్రముఖ కామెడీ షో 'జబర్దస్త్', గత కొంతకాలంగా తన రేటింగ్ కోల్పోయింది. పడిపోయిన రేటింగ్స్‌తో వెనుకబడిన ఈ షోకు మళ్లీ పునర్వైభవం తీసుకొచ్చేందుకు నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా షోకు మొదటి నుంచి పెద్ద దిక్కుగా ఉన్న ప్రముఖ నటుడు నాగబాబును తిరిగి జడ్జ్‌గా తీసుకువచ్చారు. నాగబాబు రాకతో షోలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. "ఈ కుర్చీ ఎప్పటికీ మీదే సార్" అంటూ యాంకర్ రష్మీ ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. తాను షోలో లేకపోయినా ఎప్పుడూ దాని గురించే ఆలోచించేవాడినని, ఎవరైనా తప్పు చేస్తే సెట్‌కు వచ్చి మందలించాలనిపించేదని అన్నారు.



# బస్సు ఆగింది

## తెలంగాణవ్యాప్తంగా ఆర్టీసీ సమ్మె

తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు.. డిపోలకే పరిమితమైన బస్సులు

ప్రత్యామ్నాయంగా వెయ్యి ప్రైవేటు వాహనాలు.. మెట్రో సర్వీసుల పెంపు

సమ్మె విరమించి విధుల్లో చేరాలని మంత్రి పొన్నం పిలుపు

**హైదరాబాద్, మహా :**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెతో రవాణా వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలింది. తమ డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ జేఏసీ పిలుపునివ్వడంతో బుధవారం ఉదయం నుంచే ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటీతో జరిపిన చర్చలు విఫలం కావడంతో కార్మికులు సమ్మె బాట పట్టారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని డిపోల వద్ద కార్మికులు బైఠాయించి నిరసనలు తెలుపుతుండటంతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఈ అనూహ్య పరిణామంతో సామాన్య ప్రయాణికులు, విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వేసవి ఎండల్లో ప్రయాణాలకు సిద్ధమైన వేలాది మంది బస్టాండ్లలో పడిగాపులు కాస్తూ ప్రైవేటు వాహనదారుల దోపిడీకి గురవుతున్నారు. మిగతా 2లో

### ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం

సమ్మె ప్రభావంతో హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లు బోసిపోయాయి. ఉత్తర తెలంగాణకు వెళ్లాల్సిన సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పరీక్షలకు వెళ్లాల్సిన విద్యార్థులు సమయానికి రవాణా సౌకర్యం లేక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆసుపత్రులకు వెళ్లాల్సిన వారు సైతం ప్రైవేటు వాహనాల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. చాలా చోట్ల ప్రైవేటు ఆటోలు, టాక్సీలు ప్రయాణికుల అవసరాలను ఆసరాగా చేసుకుని మూడింతలు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. పరిస్థితిని గమనించిన అధికారులు కొన్ని ప్రాంతాల్లో అద్దె బస్సులను నడిపిస్తున్నప్పటికీ, అవి రద్దీకి ఏమాత్రం సరిపోవడం లేదు.

### సమ్మె పరిష్కారం కాదు విధుల్లో చేరండి

- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి
- 32 డిమాండ్లలో 29 సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం
- సమ్మె వల్ల సామాన్య ప్రజలు, మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడతారని ఆవేదన

02



## పిఠాపురం రచ్చపై బాబు సీరియస్

- వర్మ తీరుపై అధినేత తీవ్ర అసహనం
- చిన్న చిన్న ఫ్లెక్సీల కోసం వీధులకెక్కుతారా?
- కూటమి ఐక్యత దెబ్బతింటే సహించేది లేదు
- పవన్ కల్యాణ్ కేవలం నేత మాత్రమే కాదు
- డిప్యూటీ సీఎం అన్నది గుర్తుంచుకోండి

02

## ఆవిర్భావ సభలో.. అదే హైలెట్

### 90 నిమిషాల పాటు ప్రసంగించనున్న కవిత

కవిత ప్రసంగంలో అనేక సంచలనాలు

మునీరాబాద్ ఆవిర్భావసభకు రెడీ అవుతున్న ఫైర్ బ్రాండ్

50 వేల మందితో ఆవిర్భావ సభకు ప్లాన్

టీఆర్ఎస్ కంటే వేగంగా ఫలితాలు సాధిస్తామనే ధీమా



**(హైదరాబాద్ - మహా)**

కవిత పార్టీలో తెలంగాణ.. ఎజెండాలో ఉద్యమకారులు. ఆవిర్భావ సభ తెలంగాణ రాజకీయాల్లో ఓ మైలురాయిగా నిలిచిపోయేలా ప్లాన్. లక్షమందితో సభ నిర్వహించి.. తెలంగాణ పాలిటిక్స్ లో ఒక బెంచ్ మార్క్ సెట్ చేయాలని కవిత డిసైడయ్యారు. పార్టీ ఆషామాషీగా ఉండదని, అధినేతగా కవిత తన ప్రసంగంలో 90 నిమిషాల పాటు మాట్లాడబోతున్నదని, ఈ ప్రసంగంలో అనేక సంచలనాలు ఉండబోతున్నాయని సమాచారం. కవిత పార్టీ ఆవిర్భావ సభ తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ కాగా, మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగే సభకుయాభైవేలమంది తరలివస్తారని అంచనా వేస్తున్నారు. తెలంగాణకు ఇప్పటిదాకా జరిగిన అన్యాయం, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన నష్టం, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలకు తోడు వ్యక్తిగతంగా తాను ఎదుర్కొన్న అవమానాలు, కుట్రలు అనేకం ఈ సభ ద్వారా తెలంగాణ ప్రజల ముందు ఉంచనున్నట్లు తెలుస్తోంది. పార్టీ ఆవిర్భావానికి దారితీసిన పరిస్థితులు కూడా ఆమె వివరించనున్నారు. మిగతా 2లో

## ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని పరామర్శించిన ఎంపీ ఈటల

### అపోలోలో జి.ఎం.ఆర్ ఆరోగ్యంపై ఆరా



**హైదరాబాద్, మహా:** పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిని మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ బుధవారం పరామర్శించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్య కారణాలతో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిపాల్ రెడ్డిని ఈటల రాజేందర్ స్వయంగా కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డికి అందుతున్న వైద్య సేవల గురించి అక్కడి వైద్యులతో కూడా ఈటల చర్చించారు. నియోజకవర్గంలో నిరంతరం ప్రజల మధ్య ఉండే నాయకుడు మహిపాల్ రెడ్డి అని, ఆయన భగవంతుని కృపతో సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఈటల రాజేందర్ ఆకాంక్షించారు. త్వరలోనే ఆయన తిరిగి ప్రజాసేవలో చురుగ్గా పాల్గొనాలని కోరుకుంటున్నట్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా సాగిన ఈ పరామర్శలో భాగంగా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కూడా ఈటల మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. మహిపాల్ రెడ్డి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో ఆయన కోలుకుంటున్నారని తెలిసింది. పటాన్‌చెరు నియోజకవర్గంలో బలమైన నేతగా గుర్తింపు పొందిన జి.ఎం.ఆర్ ఆసుపత్రిలో చేరారన్న వార్తతో ఆయన అనుచరులు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో, ఈటల పరామర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదు

### మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించిందన్న మంత్రి



**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న కేసీఆర్, హరీశ్ రావు, కొందరు అధికారులపై తక్షణమే ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. ఈ తీర్పును బీఆర్ఎస్ నేతలు క్లీన్ చిట్‌గా భావించడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. హైకోర్టు ఎక్కడా పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును తప్పుబట్టలేదని, దాని నియామకాన్ని పూర్తిగా సమర్థించిందని మంత్రి గుర్తు చేశారు. మేడిగడ్డ సహా మూడు బ్యారేజీలలో లోపాలు ఉన్నాయని కమిషన్ స్పష్టంగా చెప్పిందని, ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయన్న వాస్తవంలో మార్పు లేదని తెలిపారు.

## రూ.148 కోట్లతో అప్రోచ్ రోడ్ల నిర్మాణం

- జూన్ 8 కల్లా పనులు పూర్తి కావాలి
- నిధుల విడుదలకు మంత్రుల ఉపసంఘం ఆమోదం
- 1:4 నిష్పత్తిలో ప్రతిపాదనలు పంపండి
- అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం




**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో నిర్మాణం పూర్తయినప్పటికీ అప్రోచ్ రోడ్లు లేక నిరుపయోగంగా మారిన బ్రిడ్జిలకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఆయన అధ్యక్షతన 'ఇన్ఫ్రాస్ట్రక్చర్ మరియు క్యాపిటల్ వర్క్స్' క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ భేటీలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూడేళ్ల క్రితమే వంతెనలు నిర్మించినా, కేవలం అప్రోచ్ రోడ్లు లేకపోవడం వల్ల అవి ప్రజలకు అందుబాటులోకి రాకపోవడంపై డిప్యూటీ సీఎం అసహనం వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనుల కోసం రూ. 148 కోట్ల నిధుల విడుదలకు ఉపసంఘం పచ్చజెండా ఊపింది.

# బస్సు ఆగింది

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో సమ్మె ప్రభావం అత్యధికంగా కనిపిస్తోంది. వరంగల్ జిల్లావ్యాప్తంగా 600కు పైగా బస్సులు రోడ్డెక్కలేదు. ఖమ్మం రీజియన్‌లోని 7 డిపోలకు చెందిన 608 బస్సులు డిపోల బయటకు రాలేదు. తెల్లవారుజాము నుంచే కార్మికులు డిపో గేట్ల వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఖమ్మం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా, అవి నామమాత్రంగానే ఉన్నాయి. మెదక్ జిల్లాలో పోలీసులు బలవంతంగా బస్సులను నడిపించేందుకు ప్రయత్నించగా కార్మికులు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాట జరిగింది. నల్గొండ జిల్లాలో మాత్రం ఎలక్ట్రిక్ మరియు ప్రైవేటు బస్సుల వల్ల కొంతవరకు ఊరట లభించినట్లు తెలుస్తోంది.

**ప్రభుత్వ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

సమ్మెను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అద్దె మరియు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వెయ్యి బస్సులను సిద్ధం చేసింది. అనుభవం ఉన్న ప్రైవేటు డ్రైవర్లను సంప్రదించి బస్సులను నడిపేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మంచిర్యాల వంటి చోట్ల కండక్టర్లు లేకుండానే బస్సులను నడుపుతున్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఇతర శాఖల అధికారులను కూడా రవాణా పర్యవేక్షణకు కేటాయించారు. సమ్మె కాలంలో ప్రయాణికుల తాకిడిని తట్టుకునేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ కీలక నిర్ణయం తీసుకుంది. సాధారణం కంటే 56 అదనపు రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. మియాపూర్‌ఎల్బీనగర్, నాగోల్‌రాయదుర్గం మార్గాల్లో రైళ్ల ఫ్రీక్వెన్సీని 4 నిమిషాల లోపునకే తగ్గించి ప్రయాణికులకు కొంత ఊరట కల్పిస్తున్నారు.

**రాజకీయ మద్దతు - ఉధృతమైన పోరు**

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు రాజకీయ పార్టీల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని, కార్మికుల పొట్ట కొట్టే ప్రయత్నం చేస్తే సహించబోమని బీఆర్‌ఎస్ నేత జీవన్‌రెడ్డి హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సైతం సమ్మెకు సంఘీభావం తెలుపుతూ, ఈ పరిస్థితికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, ఆర్టీసీని ప్రైవేటీకరించే కుట్రలో భాగంగానే విలీన ప్రక్రియను ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

# భానుడి భగభగల్లో బాల్యం బందీ..

- గురుకులాల్లో 'వేసవి శిక్షా' శిబిరాలు!
- వడగాడ్పుల వేళ 'ప్రజా పాలన' విన్యాసాలు
- పసిప్రాణాలతో సర్కారు చెలగాటం
- సెలవుల్లేని బాల్యం.. ఎండల్లో క్రీడల పేరిట విద్యార్థులపై 'స్ప్లాష్' ప్రయోగాలు
- ఏసీ గదుల్లో ఏసీ అధికారులు.. మండుటెండల్లో మొక్కుబడి శిబిరాలకు విద్యార్థులు బలి
- 45 డిగ్రీల సెగలో ఆగని ఆటాపాట.. గురుకుల సొసైటీల వింత పోకడ

**హైదరాబాద్, మహా:** రాష్ట్రవ్యాప్తంగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు.ఉదయం 9 గంటలకే నిప్పుల కొలిమిని తలపిస్తున్న ఎండలు, వడగాడ్పులతో జనం బయటకు రావడానికే వణికిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్య ప్రజల నుంచి విద్యార్థుల వరకు అందరికీ వేసవి సెలవులు ప్రకటించి, 'ఒంటిపూట బడులు' నడిపిస్తున్న ప్రభుత్వం.. మరోపక్క గురుకుల విద్యార్థులను మాత్రం మండుటెండల్లోకి నెట్టేస్తోంది. అటు బీసీ సంక్షేమ, ఇటు మైనారిటీ గురుకుల సొసైటీలు 'వేసవి శిబిరాల' పేరిట వేల సంఖ్యలో విద్యార్థులను రప్పించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ 'ప్రజా పాలన' లక్ష్యాలను చేరుకోవ



డానికి విద్యార్థుల ప్రాణాలను పణంగా పెడుతున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. వాతావరణ శాఖ ఇప్పటికే పలు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసింది. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరులో ఉష్ణోగ్రతలు 43 నుండి 45 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. ఇళ్లలో ఫ్యాన్లు వేసుకున్నా ఉక్కపోతతో జనం అల్లాడిపోతుంటే, గురుకుల విద్యార్థులకు మాత్రం ఈ గ్రీష్మతాపంలో క్రీడలు నేర్పిస్తారట! 'స్ప్లాష్ సమ్మర్ క్యాంప్'లు, 'వేసవి శిబిరాలు 2026' పేరుతో ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ మరియు టీజీఎంఆర్‌ఈఐఎస్ సొసైటీలు విద్యార్థులను శిబిరాలకు రప్పించేందుకు రంగం సిద్ధం చేశాయి. కేవలం ప్రభుత్వ 99 రోజుల ప్రగతి ప్రణాళికలో మార్కులు కొట్టేయడానికే ఈ శిబిరాలన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**మౌలిక వసతులు మృగ్యం.. వడదెబ్బకు భయం!**

వేసవి శిబిరాలు నిర్వహించాలంటే అత్యంత చల్లని వాతావరణం, నిరంతర తాగునీరు, విద్యుత్ సరఫరా ఉండాలి. కానీ, ఎంపిక చేసిన వేదికల్లో మెజారిటీ పాఠశాలలకు సరైన ప్రహరీ గోడలు లేవు, సరిపడా కూలర్లు లేవు. కనీసం విద్యార్థులు ఆడుకోవడానికి ఇండోర్ స్టేడియంలు లేని చోట, మండుటెండలో మైదానాల్లో ఆటలు ఆడించడం పసిప్రాణాలతో చెలగాటం ఆడటమే. వడదెబ్బ తగిలితే తక్షణమే చికిత్స అందించేందుకు ఎన్ని శిబిరాల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. 'నర్సింగ్ ఆఫీసర్లు' చూసుకుంటారని అధికారులు చెబుతున్నా, అత్యవసర పరిస్థితి తలెత్తితే బాధ్యులెవరన్న భయం తల్లిదండ్రుల్లో నెలకొంది.

**సెలవులకు దూరం.. బాల్యం భారతం!**

సంవత్సరమంతా హాస్టల్ గదుల్లో, పుస్తకాల మధ్య గడిపే విద్యార్థులు.. వేసవి సెలవుల్లో ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో గడపాలని కోరుకుంటారు. ఇది వారి మానసిక వికాసానికి అవసరం. కానీ, సర్కారు వింత పోకడల వల్ల 7, 8, 9 తరగతుల విద్యార్థులు మే నెలలో కూడా మళ్లీ హాస్టల్ గదులకే పరిమితం కావాల్సి వస్తోంది. సెలవులను సెలవుల్లా ఉండనీయకుండా, శిక్షణ పేరిట విద్యార్థులను ఒత్తిడికి గురిచేయడం ఏ రకమైన విద్యా విధానమో అధికారులు స్పష్టం చేయాలి.

**మొక్కుబడి ఏర్పాట్లు.. సెన్సేషనల్ ప్రచారాలు!**

బీసీ గురుకులాల్లో 5,000 మంది, మైనారిటీ గురుకులాల్లో 4,500 మంది.. ఇలా సుమారు 10 వేల మంది విద్యార్థులను ఈ ఎండల్లో ఒకచోట చేర్చడం వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం కూడా ఉంది. రవాణా సౌకర్యం కల్పిస్తామని చెబుతున్నా, ఆర్టీసీ బస్సుల్లో గంటల తరబడి ప్రయాణం విద్యార్థులను నీరసానికి గురిచేస్తుంది. అటు హైదరాబాద్ గచ్చిబౌలి, ఎల్బీ స్టేడియాల్లో చేసే హంగామాను చూపిస్తూ, జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతోందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

**ప్రజా పాలన అంటే పసిపిల్లల కష్టాలా?**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'ప్రజా పాలన 99 రోజుల ప్రణాళిక' లో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అంటే, కేవలం గణాంకాల కోసం, ప్రభుత్వ రికార్డుల్లో 'విజయం' అని రాసుకోవడం కోసం విద్యార్థులను ఈ భగభగలాడే ఎండల్లో మైదానాలకు రప్పించాలా? అధికారుల అత్యుత్సాహం విద్యార్థుల ప్రాణాల మీదకు రాకముందే ప్రభుత్వం పునరాలోచించాలి. మేధో వికాసం, స్పోకెన్ ఇంగ్లీష్, వేద గణితం వంటివి సాధారణ విద్యా సంవత్సరంలో నేర్పించవచ్చు, కానీ ఇప్పుడే ఎందుకు అన్నదే సామాన్యుల ప్రశ్న. వెంటనే ఈ నిర్ణయాన్ని సమీక్షించి, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ శిబిరాలను వాయిదా వేయడమో లేదా రద్దు చేయడమో చేయాలని విద్యార్థి సంఘాలు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం తన పంతం నెగ్గించుకుంటుందో లేక విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తుందో వేచి చూడాలి!

# ఆవిర్భావ సభలో.. అదే హైలెట్

(మొదటిపేజీ తరువాయి)

గత కొద్దిరోజులుగా గుంటనక్క అంటూ హరీష్ రావుపై విరుచుకుపడుతున్న కవిత రాజకీయపార్టీ పెట్టే ముందు కేసీఆర్ పై కూడా నేరుగా రాజకీయ విమర్శలకు దిగుతున్నారు. అంశాలవారీగా ఎవరిమీదైనా సరే.. పోరాడుతామని తేల్చేస్తున్నారు. రాష్ట్రంలో మహిళ పిడికిలి నుంచి కొత్త పార్టీ పురుడు పోసుకోబోతోందని, పార్టీని ఆదరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నేతలు చెబుతున్నారు. అన్ని జిల్లాల నుంచి కవిత మద్దతుదారులు పెద్దఎత్తున సభకు హాజరుకాబోతున్నారని నిర్వాహకులు తెలిపారు. 20 ఏళ్లలో కవితతో కలిసి పనిచేసిన వాళ్లు, ఉద్యమంలో క్రియాశీలకంగా ఉండి ఉద్యమ ప్రయోజనాలు నెరవేరలేదని భావిస్తున్న వేలాది మంది ఉద్యమకారులు, ఎన్జీవోలతోపాటు నిపుణులను సభకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

**టీఆర్ఎస్ కంటే ముందే..**

టీఆర్ఎస్ పార్టీ 2001 ఏప్రిల్ 27న ప్రారంభించగా, కవిత పార్టీ తెలంగాణ ప్రజా జాగృతి ఏప్రిల్ 25, 2026న నూతన రాజకీయ పార్టీటా పురుడుపోసుకోనుంది. ఆవిర్భావ సభ నిర్వహణకు కవిత భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణలో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో, కేటీఆర్, కేసీఆర్ చర్యలను, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఆమె నిశితంగా విమర్శిస్తున్నారు. తాజాగా జగిత్యాల సభ వేదికగా కేసీఆర్ ప్రసంగాన్ని ఉద్దేశించి, బీఆర్ఎస్ పార్టీపై ఆమె తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రాన్ని పల్లెత్తు మాట అనలేదని, మహిళా బిల్లుపై మాట్లాడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ఉదయం 10 గంటలకు ముహూర్తం**

ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, 10 గంటలకు పార్టీ ప్రకటన ముహూర్తం ఖరారు చేసినట్లు తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తెలిపారు. వయోవృద్ధులు సభకు హాజరుకావొద్దని సూచించారు. సభకు హాజరయ్యే వారి కోసం తెలంగాణ వంటకాలను సిద్ధం చేస్తున్నారు. మొత్తం 33రకాల తెలంగాణ వంటకాలు రెడీ అవుతున్నాయి.

# మమతా బెనర్జీ చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పు

**ఢిల్లీ, మహా:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరుపై దేశ సర్వోన్నత న్యాయస్థానం అత్యంత కఠినమైన వ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు సంస్థల సోదాలు జరుగుతున్న సమయంలో స్వయంగా ముఖ్యమంత్రే లోపలికి వెళ్లడం ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టడమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఐపాక్ కార్యాలయంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేపట్టిన దాడుల విషయంలో మమతా బెనర్జీ జోక్యాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు.. బెంగాల్‌లో నెలకొన్న పరిస్థితులు అత్యంత అసాధారణంగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. ఈ వ్యవహారాన్ని కేంద్రం, రాష్ట్రం మధ్య వివాదంగా చిత్రీకరించే ప్రయత్నాన్ని కోర్టు తోసిపుచ్చింది. జనవరిలో కోల్ కతాలోని ఐపాక్ కార్యాలయం మరియు దాని వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్ నివాసంలో బొగ్గు అక్రమ రవాణా కేసుకు సంబంధించి ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వందలాది మంది పోలీసులతో అక్కడికి చేరుకుని, దర్యాప్తుకు ఆటంకం కలిగించడమే కాకుండా కొన్ని కీలక ఫైళ్లను (గ్రీన్ ఫైల్) మరియు ఎలక్ట్రానిక్ పరికరాలను బలవంతంగా తీసుకెళ్లారని ఈడీ ఆరోపించింది. దీనిపై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి దర్యాప్తు మధ్యలోకి వెళ్లి సాక్ష్యాధారాలను అడ్డుకోవడం లాంటి చర్యలు రాజ్యాంగ విరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది.

"రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఒక వ్యక్తి దర్యాప్తు ప్రక్రియను అడ్డుకోవడం అనేది ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు వంటిది. ఇది కేవలం కేంద్రం మరియు రాష్ట్రం మధ్య వివాదం కాదు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి వ్యవస్థలను ప్రభావితం చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేశారు" అని ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు సీర్వాయ్ వంటి మహనీయుల ప్రస్తావన తెచ్చిన కోర్టు.. దేశంలో ఇలాంటి రోజు వస్తుందని, ఒక ముఖ్యమంత్రే దర్యాప్తు సంస్థల కార్యాలయాల్లోకి చొరబడతారని వారు ఊహించి ఉండరని వ్యాఖ్యానించింది. రాష్ట్రంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులపై తాము కళ్ళు మూసుకోలేమని, ఇది అత్యంత విచారకరమైన పరిణామమని పేర్కొంది.

మరోవైపు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వీ వాదిస్తూ.. ఈ దాడులు రాజకీయ ప్రేరేపితమని, ఎన్నికల వేళ తృణమూల్ కాంగ్రెస్‌ను బలహీనపరిచేందుకు కేంద్రం చేస్తున్న కుట్ర అని పేర్కొన్నారు. ఈడీ ఒక ప్రభుత్వ విభాగమని, అది ప్రాథమిక హక్కుల ఉల్లంఘన పేరుతో నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించలేదని వాదించారు. అయితే, కోర్టు ఈ వాదనలను తోసిపుచ్చింది. దర్యాప్తు సంస్థల విధుల నిర్వహణకు ఆటంకం కలిగించడం రాజ్యాంగపరమైన సంక్షోభానికి దారితీస్తుందని హెచ్చరించింది. ఈ మొత్తం వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను కోర్టు కొనసాగిస్తోంది.

బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలి విడత పోలింగ్ రేపు (ఏప్రిల్ 23) ప్రారంభం కానున్న తరుణంలో సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారం రేపుతున్నాయి. ఎన్నికల వేళ సాక్ష్యాధారాల మాయం మరియు ముఖ్యమంత్రి జోక్యం వంటి అంశాలు ఓటర్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో దర్యాప్తు సంస్థలకు స్వతంత్రత ఉండాలని, వాటి విధుల్లో రాజకీయ నేతల జోక్యం అంగీకరించబోమని న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

## ఏప్రిల్ 30న మంత్రివర్గ విస్తరణ ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

**నవీన్ యాదవ్:**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుండి బలమైన పట్టున్న నేతగా ఆయనకు అవకాశం ఉండొచ్చని చర్చ జరుగుతోంది. సిటీ లో యూత్ ఫాలోయింగ్, బలమైన యాదవ సామాజికవర్గం కలిసొచ్చే అంశాలుగా చెబుతున్నారు. జీహెచ్ఎంసీలో పార్టీ పటిష్టానికి కూడా ఇది దోహదపడే అవకాశముంది.

**బీర్ల ఐలయ్య:**

ఆలేరు ఎమ్మెల్యేగా ఉన్న ఐలయ్యకు పార్టీలో ఉన్న విధేయత, సామాజిక సమీకరణాల దృష్ట్యా ఛాన్స్ దక్కే అవకాశం ఉంది.

**మున్నూరు కాపు సామాజిక వర్గం (ఆది శ్రీనివాస్)**

**ఆది శ్రీనివాస్:**

వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు మున్నూరు కాపు కోటాలో మంత్రి పదవి దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో మరియు సామాజిక వర్గ పరంగా ఆయన పేరును అధిష్టానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రాంతీయ సమీకరణాలు: రాబోయే ఎన్నికలు లేదా రాజకీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాల వారీగా ఖాళీలను భర్తీ చేసే అవకాశం ఉంది.

**అధిష్ఠానం నిర్ణయం:**

ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన రాకపోయినప్పటికీ, మీడియాలో మరియు రాజకీయ వర్గాల్లో ఈ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

# పిఠాపురం రచ్చపై బాబు సీరియస్

- వర్మ తీరుపై అధినేత తీవ్ర అసహనం
- చిన్న చిన్న ఫ్లెక్సీల కోసం వీధులకెక్కుతారా?
- కూటమి ఐక్యత దెబ్బతింటే సహించేది లేదు
- పవన్ కల్యాణ్ కేవలం నేత మాత్రమే కాదు
- డిప్యూటీ సీఎం అన్నది గుర్తుంచుకోండి



**అమరావతి, మహా:** పిఠాపురం నియోజకవర్గంలో గత కొన్ని రోజులుగా సాగుతున్న ఫ్లెక్సీ వివాదంపై తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రభుత్వ ప్రతిష్టను పెంచాల్సిన బాధ్యత గల కీలక నేతలే, అత్యంత స్వల్పమైన ఫ్లెక్సీ గొడవల కోసం వీధులకెక్కడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో భేటీ అయిన చంద్రబాబు, నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ కేవలం ఒక పార్టీకి నేత మాత్రమే కాదని, ఆయన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అన్న విషయాన్ని ప్రజాప్రతినిధులు విస్మరించకూడదని గుర్తు చేశారు. ప్రోటోకాల్ పేరుతో రచ్చ చేయడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని, ఇది కూటమి ఐక్యతను దెబ్బతీస్తుందని ఆయన హెచ్చరించారు. నియోజకవర్గంలో టీడీపీ నేత వర్మ, జనసేన నేత దొరబాబు మధ్య ఉన్న పాత రాజకీయ విభేదాలే ఈ తాజా గొడవలకు ఆజ్యంపోశాయని పార్టీ అధిష్టానం ప్రాథమికంగా గుర్తించింది. ఫ్లెక్సీల్లో ముఖ్యమంత్రి ఫోటో లేదనే వంకతో వివాదాలు సృష్టించడం కాకుండా, క్షేత్రస్థాయిలో సమన్వయంతో ముందుకు వెళ్లాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించి పరిష్కరించుకోవాలి తప్ప, బహిరంగంగా విమర్శలు చేసుకోవడం వల్ల ప్రతిపక్షాలకు ఆయుధాలు ఇచ్చినట్లవుతుందని మందలించారు. రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన పిఠాపురంలో ఇరు పార్టీల నేతలు పాలు, నీళ్లలా కలిసి పనిచేయాలని, అక్కడ జరిగే ప్రతి కార్యక్రమం రాష్ట్రానికే ఒక రాజకీయ నమూనాగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను రంగంలోకి దించిన చంద్రబాబు, వెంటనే పిఠాపురం నేతలతో మాట్లాడి సర్దుబాటు చేయాలని ఆదేశించారు. స్థానిక నేతల మధ్య ఉన్న మనస్పర్థలను తొలగించి, కూటమి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అందరూ కలిసి నడిచేలా చూడాలని సూచించారు. చిన్న చిన్న వివాదాలను పెద్దవి చేసి అనవసర రచ్చ చేయవద్దని, వర్మతో నేరుగా మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దాలని పల్లా శ్రీనివాస్‌కు దిశానిర్దేశం చేశారు. పిఠాపురంలో పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నందున, అక్కడ క్రమశిక్షణ తప్పినా, సమన్వయం లోపించినా కఠినంగా వ్యవహరిస్తామని అధినేత పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు.

# సమ్మె పరిష్కారం కాదు విధుల్లో చేరండి

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులు తలపెట్టిన సమ్మెను విరమించుకోవాలని, ప్రజా సంస్థను కాపాడుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమ్మె ఏ సమస్యకూ పరిష్కారం కాదని, ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ పరిశీలన చేస్తోందని, నాలుగు వారాల్లో నివేదిక వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. సంస్థను, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు సమ్మెను విరమించుకోవాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నలుగురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామని, ఇది కాలయాపన చేసే వ్యూహం కాదని స్పష్టం చేశారు. ఉద్యోగులు లేవనెత్తిన 32 డిమాండ్లలో 29 అంశాలపై ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని, వాటిని వెంటనే పరిష్కరించవచ్చని తెలిపారు. మిగిలిన ఆర్టీసీ విలీనం, యూనియన్ల గుర్తింపు వంటి అంశాలు సాంకేతిక పరమైనవని, వీటిపై లోతైన పరిశీలన అవసరమని, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ, ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామని అన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీతో పాటు బకాయిపడ్డ డీఏలను, 2013 నాటి బాండ్లను సైతం పరిష్కరించినట్లు తెలిపారు.

రూ.1,205 కోట్లుగా ఉన్న పీఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు, రూ.690 కోట్లుగా ఉన్న సీసీఎస్ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించామన్నారు. పీఎఫ్, సీసీఎస్ కోసం ప్రతినెలా రూ.75 కోట్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు. పని భారం తగ్గించేందుకు త్వరలోనే 4,538 మంది ఉద్యోగుల నియామకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 1,134 కారుణ్య నియామకాలు చేపట్టామని, గతంలో తొలగించిన 250 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రస్తుతం కోలుకుంటోందని, ఈ దశలో సమ్మె చేయడం సంస్థకు, ప్రజలకు నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీపై ఆధారపడి ఉన్నారని, వీరిలో 45 లక్షల మంది మహిళలేనని గుర్తుచేశారు. పేద ప్రజలు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను భరించలేరని, కాబట్టి ప్రజా రవాణాకు ఆటంకం కలిగించకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని, వారికి అండగా ఉంటుందని భరోసా ఇస్తూ, ప్రజలకు అసౌకర్యం కలగకుండా వెంటనే విధుల్లో చేరాలని కోరారు.

## రూ.148 కోట్లతో అప్రోచ్ రోడ్ల నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)

నిధుల మంజూరు, పనుల అమలులో జాప్యాన్ని నివారించేందుకు డిప్యూటీ సీఎం అధికారులకు కీలక సూచనలు చేశారు. వివిధ శాఖల నుంచి ఆర్థిక శాఖకు పంపే ప్రతిపాదనలు 1:4 నిష్పత్తిలో ఉండాలని, అప్పుడే సబ్ కమిటీలు వాటిని త్వరితగతిన చర్చించి ఆమోదించడం సులభమవుతుందని స్పష్టం చేశారు. సరైన పద్ధతిలో ప్రతిపాదనలు ఉంటే పనులు వేగవంతం అవుతాయని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా, వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని, దానికి అనుగుణంగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనుల గడువుపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కఠిన ఆదేశాలు జారీ చేశారు. జూన్ 8వ తేదీ లోపు రాష్ట్రవ్యాప్తంగా అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తి కావాలని ఆయన గడువు విధించారు. ఈ పనుల ప్రగతిని తాను స్వయంగా ప్రతి వారం సమీక్షిస్తానని, టెండర్ల ప్రక్రియ నుంచి పనుల నాణ్యత వరకు అన్ని అంశాలను పర్యవేక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు రవాణా కష్టాలు తీరడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కుట్రలు కూలాయి.. కాళేశ్వరం గెలిచింది

### హైకోర్టు తీర్పుపై కేటీఆర్

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకల కేసులో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పుతో తెలంగాణ ప్రజలు, రైతులు గెలిచారని.. రాజకీయ రాబందులు, పిట్టల దొరల కుట్రలు గోదావరి ప్రవాహంలో కొట్టుకుపోయాయని ఆయన ధ్వజమెత్తారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఘాటుగా స్పందించారు. హైకోర్టు తీర్పుతో కూలింది కాళేశ్వరం కాదు.. ఆ ప్రాజెక్టుపై కాంగ్రెస్ పన్నిన కుట్రలు కూలిపోయాయి అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం పెరిగిందని, నిజాన్ని ఎవరూ దాచలేరని ఈ తీర్పుతో స్పష్టమైందని అన్నారు. ఇది జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కాదు.. 'పీసీసీ' (కాంగ్రెస్) నివేదిక అని తాము అప్పుడే చెప్పామన్నారు. మేడిగడ్డ కుంగడం వెనుక పెను కుట్ర దాగి ఉందని, అది కచ్చితంగా కాంగ్రెస్ పనే అయి ఉంటుందని కేటీఆర్ ఆరోపించారు.

# ప్రధాని మోదీపై 'ఉగ్రవాది' వ్యాఖ్యల దుమారం

- ఏఐసీసీ చీఫ్ ఖర్గేకు ఈసీ నోటీసులు
- 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం
- నిబంధనల ఉల్లంఘనపై ఈసీ సీరియస్
- బీజేపీ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఎన్నికల సంఘం



**ఢిల్లీ, మహా:** భారత ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చిక్కుల్లో పడ్డారు. ప్రధానిని ఉద్దేశించి 'ఉగ్రవాది' అని వ్యాఖ్యానించడంపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు బుధవారం ఖర్గేకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ, వచ్చే 24 గంటల్లోగా దీనిపై లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు ప్రాథమికంగా నిర్ధారించిన ఈసీ, ఖర్గే వ్యాఖ్యలను తీవ్రమైనవిగా పరిగణించింది.

**చెన్నై వేదికగా చెలరేగిన వివాదం**

మంగళవారం (ఏప్రిల్ 21) తమిళనాడులోని చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో అన్నాడీఎంకే పొత్తును విమర్శించే క్రమంలో ప్రధాని మోదీని 'ఉగ్రవాది' అని సంబోధించారు. "సమానత్వం, న్యాయంపై నమ్మకం లేని ఒక ఉగ్రవాదితో అన్నాడీఎంకే ఎలా చేతులు కలుపుతుంది?" అని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు ఒక్కసారిగా రాజకీయ ప్రకంపనలు సృష్టించాయి. ప్రధాని వంటి అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని ఉగ్రవాదితో పోల్చడం ద్వారా ఖర్గే రాజకీయ విలువలను దిగజార్చారని బీజేపీ ఆరోపించింది.

**ఈసీకి చేరిన ఫిర్యాదు..**

**రంగంలోకి కేంద్ర మంత్రులు**

ఖర్గే వ్యాఖ్యలపై బుధవారం ఉదయం కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ్వాల్‌లతో కూడిన బీజేపీ ప్రతినిధి బృందం ఎన్నికల సంఘాన్ని కలిసింది. ప్రధానిపై చేసిన ఈ వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత దూషణలే కాకుండా, దేశ సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థలను కించపరచడమేనని ఫిర్యాదు చేశారు. ఖర్గేపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆయనను ప్రచారం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన అనంతరం ఈసీ ఈ నోటీసులు జారీ చేసింది.

**ఖర్గే వివరణ: అది 'ట్యాక్స్ టెర్రరిజం'**

వివాదం ముదురుతుండటంతో మల్లికార్జున ఖర్గే తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. తాను ప్రధానిని వ్యక్తిగతంగా ఉగ్రవాది అనలేదని, ఆయన అనుసరిస్తున్న విధానాలను ఉద్దేశించి అన్నానని చెప్పారు. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ప్రతిపక్షాలను ప్రధాని 'భయభ్రాంతులకు' గురిచేస్తున్నారని, ఆ అర్థంలోనే తాను మాట్లాడానని స్పష్టం చేశారు. దేశంలో 'ట్యాక్స్ టెర్రరిజం' నడుస్తోందని, రాజకీయ ప్రత్యర్థులను అణచివేసేందుకు రాజ్యాంగ వ్యతిరేక పద్ధతులు వాడుతున్నారని ఆయన ఆరోపించారు.

**నిబంధనల ఉల్లంఘనపై ఈసీ నజర్**

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో ప్రత్యర్థి నాయకులపై వ్యక్తిగత దూషణలు చేయడం, వారి గౌరవానికి భంగం కలిగించేలా మాట్లాడటం నిబంధనల ప్రకారం నేరమని ఈసీ గుర్తు చేస్తోంది. గతంలో కూడా ఇటువంటి వ్యాఖ్యల విషయంలో నాయకులకు ఈసీ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పుడు ఖర్గే ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే, ఆయనపై ప్రచార నిషేధం విధించడం లేదా ఇతర కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఎన్నికల వేళ ఈ నోటీసుల వ్యవహారం ఇప్పుడు జాతీయ స్థాయిలో హాట్ టాపిక్‌గా మారింది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికల వేళ ఈ వివాదం కాంగ్రెస్ బీజేపీ మధ్య మాటల యుద్ధాన్ని మరింత ముదిరించింది. ఖర్గే వివరణపై ఎన్నికల సంఘం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

## కాళేశ్వరంపై సీబీఐ విచారణకు సిద్ధమా?

(మొదటిపేజీ తరువాయి)

కాళేశ్వరం అంశంపై హైకోర్టు "క్లీన్ చీట్" ఇచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి తీవ్రంగా మండిపడ్డారు. నిజంగా ఎలాంటి అవకతవకలు జరగలేదంటే, స్వతంత్ర సంస్థ ద్వారా విచారణకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని పొంగులేటి డిమాండ్ చేశారు. విచారణ జరిగితే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే బీఆర్ఎస్ నాయకత్వం వెనుకడుగు వేస్తోందని ఆరోపించారు. భారీ ఆర్థిక దోపిడీ, కమీషన్ల వ్యవహారం, కాంట్రాక్టుల లోపాలు అన్నీ బహిర్గతమవుతాయనే భయమే వారిని వెంటాడుతోందని మంత్రి అన్నారు. ఇదే భయంతో బీజేపీతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని, విచారణను తప్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు.

మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | గురువారం, తిరుపతి | 23-04-2026



# ఆలియా ఆగమనం నిజమేనా?

'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు బాలీవుడ్ హీరోయిన్ ఆలియా భట్. ఆ తర్వాత ఆలియా భట్ హీరోయిన్‌గా చేయనున్నారంటూ కొన్ని పెద్ద తెలుగు సినిమాల పేర్లు వినిపించినప్పటికీ ఏదీ ఫైనలైజ్ కాలేదు. తాజాగా ఆలియా భట్ పేరు మరోసారి ప్రస్తావనకు వచ్చింది. కానీ హీరోయిన్‌గా కాదు... కథలో ఓ కీలక పాత్ర కోసం ఆలియా భట్‌ను సంప్రదించారట. ఎవరంటే...'డ్రాగన్' సినిమా (ప్రచారంలో ఉన్న టైటిల్) టీమ్. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'డ్రాగన్'. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు కీలకమైన పాత్రలో అనిల్ కపూర్ నటిస్తున్నారని తెలిసింది. కథను మలుపు తిప్పే మరో లీడ్ రోల్‌లో నటించనున్నారంటూ శ్రుతీహాసన్, రష్మికా మందన్నా, కాజోల్... వంటి వార్ల పేర్లు వినిపించాయి. తాజాగా ఆలియా భట్ పేరు తెరపైకి వచ్చింది. 'ఆర్‌ఆర్‌ఆర్' (రామ్‌చరణ్ మరో హీరో) సినిమాలో హీరో ఎన్టీఆర్, ఆలియా భట్ స్క్రీన్ షేర్ చేసుకున్నారు. మరి... మరోసారి 'డ్రాగన్' సినిమా కోసం ఎన్టీఆర్, ఆలియా భట్ స్క్రీన్ షేర్ చేసుకుంటారా? టాలీవుడ్‌కు మరోసారి ఆలియా ఆగమనం నిజమేనా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు. మైత్రీ మూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జూన్ 11న రిలీజ్ కానుంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034